Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-3 ;July, Aug & Sept ),2026

# "ప్రాచీన తెలుగు సంకలన సాహిత్యం ` చారిత్రక ఆవిర్భావ వికాసం"

**డా|| పి. విజయకుమార్**
**అసోసియేట్ ప్రొఫెసర్,తెలుగుశాఖ, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్**

Article Received:09-06-2025 Article Modified:05-08-2026
Article Accepted:07-08-2026 Article Published:07-08-2026
DOI:10.37854/UIJMR.2026.3.3.44

కవి తనకు పూర్వమందున్న కవుల కావ్యాల నుండి వర్ణనాంశాలుగాని, శాస్త్ర విషయాలు గాని సేకరించి వానిని వర్గీకరించి ఏకాకరమైన ఒక కృతిగా సమకూర్చే సాహిత్య ప్రక్రియ సంకలన గ్రంథం. చారిత్రకంగా తెలుగులో ప్రాచీనకాలంలో వెలసిన సంకలన గ్రంథాల సంఖ్య పరిమితమే అయినా వాటి ప్రయోజనం మాత్రం అపరిమితం.

## తెలుగులో సంకలన సాహిత్యం- ఆవిర్భావ వికాసాలు

"ఉత్పాదకః కవిః కశ్చిత్కశ్చిచ్చ పరివర్తకః
ఆచ్ఛాదక స్తథా చాన్యస్తథా సంవర్గ కోపరః" ` రాజశేఖరుడు (కావ్యమీమాంస)

"ఒక్కొక్క కవి నూతన మార్గాలను సూచిస్తాడు. ఒక్కొక్కడు మార్పులు చేస్తాడు. ఒక్కొక్కడు హరించిన దానిని కప్పిపుచ్చుతాడు. ఒక్కొక్కడు తన దానిగా చేసుకుంటాడు" అని రాజశేఖరుడు స్పష్టం చేశాడు. ఇందులో సంకలనకారులు అన్ని మార్గాలకీ చెందినవారే. వారు సృష్టించిన మార్గం నిత్యనూతనం. సర్వజన సుబోధకం. ఎందరో కవులు సంపత్తి, విలక్షణ, వైశిష్ట్యాలను లోకానికి తేటతెల్లం చేస్తూ తనకు తానుగా నిలబడతాడు. వారిలో ఎక్కడ నుండి కొల్లగొట్టబడిందో తెలియజేయడానికి ఒప్పుకోలేని వాళ్ళు కూడా ఎందరో ఉన్నారు. వారు తీసుకొచ్చిన మార్పు మాత్రం జ్ఞానానందం సముత్పన్నమనడానికి సందేహించనవసరం లేదు.

### సంకలనం ఆవిర్భావదశ :

11వ శతాబ్దం ఆంధ్రసాహిత్యానికి మరువలేని కాలం. లిఖిత సాహిత్యం సుస్పష్టరూపం దాల్చి ఆంధ్రుల ముందు ఆంధ్ర మహాభారతం రూపంలో నిలిచింది. దీనిని ఈ స్థితికి చేర్చిన వారిద్దరు. ఒకరు రాజరాజ నరేంద్రుడు, రెండు నన్నయ. ఒకరు భర్త, మరొకరు కర్త. ఆంధ్ర మహాభారతాన్ని నన్నయ

రాజరాజుని అంకితమివ్వక పోయినప్పటికీ ప్రేరకుడు, పోషకుడు అనే విషయాలు భారతావతారిక వలన విదితమే.

ఆంధ్రమహాభారతం స్వరూప స్వభావాల విషయానికొస్తే ఒకటి సంస్కృతానువాదం, రెండవది చంపువు, మరొకటి కురు పాండవుల ఇతిహాసం. పంచమవేదమని ప్రశస్తి గాంచినది. పావులూరి మల్లన గణితశాస్త్రాన్ని కూడా పద్యరూపంలోనే రచించాడు. శివకవుల యుగంలో సాహిత్య విలువలు సృజనాత్మకత అపారంగా కనిపిస్తాయి. ఉదాహరణం, ద్విపద, రగడ, దేశి పురాణం, శతకం, దండకం, గద్యలు మొదలైన సరికొత్త ప్రక్రియలు పుట్టాయి. సాహిత్యం మతంతో పెనవేసుకుపోయింది. సర్వజన సుబోధకమైన స్థాయికి చేరడానికి ప్రయత్నించింది.

**సకలనీతి సమ్మతం :**

ఇది తెలుగులో సంకలన గ్రంథ ప్రక్రియకు శ్రీకారం చుట్టిన గ్రంథం. పదిహేనవ శతాబ్దానికి చెందిన మడికి సింగన దీని కర్త. కవిత్రయ భారతం, నన్నెచోడుని కుమారసంభవం, మంచన కేయూరబాహుచరిత్ర మొదలైన లబ్య గ్రంథాల్లోవే కాక ఇప్పటికీ లభించని కామందకం, పంచతంత్రి, నీతిభూషణం, నీతిసారం, పురుషార్థసారం, ముద్రామాత్యం, శ్రీగిరీ శతకం, శ్రీ రామాయణం, మిత్రనీతులు, నీతి తారావళి - అనే గ్రంథాల్లోని పద్యాలు కూడా ఇందులో ఉదహరింపబడ్డాయి. రాజనీతికి సంబంధించిన దాదాపు వేయి పద్యాలు మూడాశ్వాసాల్లో వివిధ విషయాల క్రింద విభజింపబడి ఇది ఒక రాజనీతి పద్య సంకలనంగా విరాజిల్లుతుంది. ఈ సంకలనం మూలంగా ప్రాచీన ఆంధ్ర వాఙ్మయంలో నష్టమైన నీతిశాస్త్ర గ్రంథాలెన్నో మనకు తెలుస్తున్నాయి. తెలుగు పరిశోధకులందరికీ ప్రాతఃస్మరణీయులైన మానవల్లి రామకృష్ణ కవిగారు ఈ గ్రంథాన్ని మొట్టమొదట 1923లో విస్తృత కవుల కృతుల్లో ఏదో ఒక గ్రంథంగా ప్రకటించారు. దీని కాగితపు ప్రతి అమరచింత సంస్థానాధీశ్వరులైన సీలూరామ భూపాల బహద్దర్ గారి నుండి కవిగారికి లభించిందట. 1970లో నిడుదవోలు వారి విపుల పీఠికతో.

తిక్కన, ఎర్రనలు భారత భాగాల్ని నన్నయ మార్గంలోనే పూర్తి చేశారు. తిక్కన ఒక్క అడుగు ముందుకు వేసి వచనాన్ని వెలితి చేసి నిర్వచనోత్తర రామాయణాన్ని రచించాడు. శ్రీనాథుడు పురాణ వస్తువుకి కావ్యచ్ఛాయ కల్పించాడు. రానురాను వర్ణనలు ఎక్కువైనవి. ఇదీ మడికి సింగన సకలనీతి సమ్మతం పుట్టుక ముందు తెలుగు సాహిత్య స్థూల స్వరూపం.

సకలనీతి సమ్మతం పుట్టుకని ఈ ప్రాచీనస్థితి ఏ విధంగా తోడ్పడిందో తెలుసుకోవాలి. కవులలో సరికొత్త సాహిత్యప్రక్రియలో వెలయించాలనే భావం సుస్పష్టంగా గోచరిస్తుంది. సాహిత్యాన్ని సమాజ వికాసానికి ఉపకరించేలా చేయాలనే తపన కనిపిస్తుంది. మతానుసారమైన నైతిక విలువలు కనిపిస్తాయి.

ఏవో ద్విపద, రగడలాంటి రెండు మూడు ప్రక్రియలు తప్ప, తక్కిన ప్రక్రియలన్నీ పద్యగద్యాలను ఆధారం చేసుకునే పుట్టు ప్రారంభించాయి. ఇప్పటివరకు వెలువడిన సాహిత్యంలో ఏ గ్రంథం కూడా ఏ ప్రత్యేక విషయానికి ప్రాతినిథ్యం వహించే స్థాయిలో లేదని తెలుస్తుంది. దీని రెండవ ముద్రణం కూడా వెలువడింది.

**ఉదాహరణ పద్యములు :**

దీని ప్రతి ఒక్కటి ఆంధ్రసాహిత్య పరిషత్తు (కాకినాడ) వారి గ్రంథాలయంలో ఉన్నది. తుది మొదళ్ళు లేకపోవటం వల్ల ఈ గ్రంథ సంధాత పేరుకానీ, అతడీ సంకలనానికి పెట్టిన పేరు కానీ తెలియవు. ఉదాహరణ పద్యాలన్న పేరు గ్రంథాలయం వాళ్ళు పెట్టిందే. ఈ సంధాత పెదపాటి జగ్గన పదహారో శతాబ్దానికి చెందినవాడని చెప్పవచ్చు. ఈ సంధాత కూడా ఈ శతాబ్దానికి చెందినవాడని చెప్పవచ్చు. ఈ సంధాత తన కాలానికి ప్రసిద్ధంగా ఉన్న అనేక కావ్యాల్లోని వందలకొద్ది పద్యాలను వివిధ విషయాలుగా విభజించి ఉదహరించాడు. ఈ సంకలనంలో మనకిపుడు లభ్యమౌతున్న కవిత్రయ భారతాది గ్రంథాల్లో నుండే గాక లభ్యంగాని అనేక ప్రాచీన కావ్యాల నుండి కూడా అనేక పద్యాలు సేకరింపబడినవి. ఈ సంకలనం వల్ల తెలియవస్తున్న అలబ్ధ కావ్యాలనూ, తత్కర్తలనూ పేర్కొన్నారు.

| <u>అలబ్ధకావ్యాలు</u> | <u>కర్త</u> |
|---|---|
| విక్రమసేనము | చిమ్మపూడి అమరేశ్వరుడు |
| కళావతీ శతకము | తేళ్ళపూడి కసవరాజు |
| కాదంబరి | భాస్కరుని కేతనప్రెగ్గడ |
| కుశలవోపాఖ్యానం | చిరుమర్రి గంగరాజు |
| నందన చరిత్ర | గంగరాజు చౌడయ్య |
| విజయసేనం | తిక్కన |
| ప్రద్యుమ్న చరిత్ర | పొన్నాడ పెద్దిరాజు |
| అనిరుద్ధ చరిత్ర | భావన పెమ్మన |
| విష్ణుకథా నిధానము | బైతరాజుముమ్మయ |
| కేదారఖండము | పెదపాటి సోమయ |
| అధర్వణ భారతం | అధర్వణాచార్యుడు |
| అమరుకం | కానుకొలను అన్నమరాజు |
| కువలయాశ్వచరితం | కేతన |

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-3 ;July, Aug & Sept ),2026

| | |
|---|---|
| వీరమహేశ్వరం | నిశ్శంకుని కొమ్మయ |
| బాలభారతం | శాకమాని గంగాధరుడు |
| సౌగంధికాపహరణం | రాయసం గణపయ |
| నాసికేతోపాఖ్యానం | చందలూరి చిక్కయ |
| కాంచీ మహాత్మ్యం | కుడిచెర్ల తిప్పరాజు |
| శివకాంచీ మహాత్మ్యం | రాపరది దేచిరాజు |
| హరిశ్చంద్ర కథ | దేవరాజ భట్టు |
| శ్రీ విష్ణుపురాణం | పశుపతినాగనాథుడు |
| జినేంద్రపురాణం | పద్మకవి |
| అష్టమహిషీ కల్యాణం | రెడ్డిపల్లె ముత్తమరాజు |
| బృహన్నారదీయం | వాసిరాజు రామయ్య |
| త్రిపుర విజయం | పోతరాజు వీరయ్య |
| శ్రీరంగ మహాత్మ్యం | చెన్నమల్లు శ్రీగిరన్న |
| ఆదిపురాణం | సర్వదేవుడు |
| విరాటం | సర్వదేవుడు |
| శాకుంతలం | సిద్ధనప్రెగ్గడ |
| త్రిపుర విజయం | పెదపాటి సోమయ |
| వసంతవిలాసం | నాచన సోమన |
| ఇంద్రసేనం | నన్నయ |
| పురాతన చరిత్రం | ? |
| రంగనాథ శతకం | ? |

ఇక్కడ పేర్కొన్న వాటిలో మొదటి పది కావ్యాలను పెదపాటి జగ్గన్న ప్రబంధ రత్నాకరంలో పేర్కొన్నాడు. తక్కినవి ఈ గ్రంథ సంధాత మాత్రమే ఉదహరించినట్టివి. అధర్వణ భారతం, వసంత విలాసం, విరాటం, ఈ మÖడూ కొన్ని ఛందో గ్రంథాల్లో కూడా ఉదహరించబడినవి. ఇక తక్కిన కావ్యాలన్నీ ఈ సంకలన కర్తవల్ల తెలియవచ్చేదే. ఈ విధంగా తెలుగు సాహిత్య చరిత్రకు ఎంతో మేలు చేసిన ఈ గ్రంథ సంధాతపేరు మనకు తెలియకపోయినా ఆయన సంకలనం మాత్రం తెలుగు సాహిత్య చరిత్రకారులకు చిరస్మరణీయం.

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-3 ;July, Aug & Sept ),2026

**ప్రబంధ రత్నాకరం (సంకలనం) - కవి పరిచయం :**

ఇది పూర్వ సంకలన గ్రంథం. సంకలన గ్రంథకర్త పెదపాటి జగ్గన్న. పెదపాటి జగన్నాథ కవిగా ప్రసిద్ధుడు. స్వప్న వృత్తాంతంలో జగన్నాథస్వామి "ఆరయ రామప్రెగ్గడకులాగ్రణి గంగయ మంత్రి జగ్గ" అని సంకలన గ్రంథకర్తను సంబోధించినట్లు కలదు. అందువలన "రామాప్రెగ్గడ". ఇంటిపేరని ఒక అభిప్రాయం కలదు .

రామాప్రెగ్గడ కులాగ్రణి అనగా రామాప్రెగ్గడ వంశమందు శ్రేష్ఠుడని అర్థం. జగ్గన వంశావతార వర్ణనలో మొలపురుషుడు రామాప్రెగ్గడ అని ఉంది. (9 పం1.ఆ). ఆ వంశావతార వర్ణనలోనే శ్రీ పెదపాటి పురీ బాలగోపాలకృష్ణ ప్రసాదిత శ్రీల వెలసి..... జగ్గన మంత్రి వరుడు" అని ఉంది. (21 ప. 1.ఆ) పెదపాడులోని బాలగోపాల కృష్ణుని అనుగ్రహం కల జగ్గన పెదపాడు నివాసి అవుతాడు. ఊరిపేరు పెదపాడు. ఊరిపేరు ఇంటి పేరగుట సర్వసాధారణం. పెదపాటి జగ్గన్న నామధేయ ప్రణీతంబని ఆశ్వాసాంత గద్యల్లో ఉన్నది.

**జగ్గన్న కాల నిర్ణయం :**

ప్రబంధ రత్నాకరంలో పింగళి సూరన, భట్టుమొర్తి ప్రభృతుల పద్యాల్లేవు. కావున జగన్నాథకవి 1550-60 ప్రాంతం వాడని ఒక అభిప్రాయం వుంది. కాని తదనంతరుడైన అద్దంకి గంగాదరుని 'తపతీ సంవరణోపాఖ్యాన పద్యం ఉంది. అంతేకాదు ప్రబంధ రత్నాకరం పూర్తిగా లభింపలేదు. తంజావూరు సరస్వతీమహలు గ్రంథాలయంలో తాళపత్ర గ్రంథం మొడు ఆశ్వాసంలో పెద్ద గ్రంథపాతం ఉంది. ఆ గ్రంథపాతం, తదుపరి తృతీయాశ్వాసం, చతుర్థాశ్వాసం చాలా వరకు గల ప్రత్యంతరం కలదు.

ప్రథమాశ్వాసంలోని ప్రణాళికను బట్టి పంచమాశ్వాసం ఉండాలి. ఉపలబ్ధం కాలేదు. ఉపలబ్ధమైన అసమగ్ర ప్రతిలో పింగళి సూరన, భట్టుమొర్తి ప్రభృతుల పద్యాలు లేవని, ప్రబంధ రత్నాకరం 16వ శతాబ్ద గ్రంథమని నిర్ణయించటమే ప్రామాణికం. తంజావూరి ప్రతి యందు

కం. నీవెంత వేడుకొన్నను
గేవల పాతకుల కేలకృప పుట్టదు మహిన్
దేవుడు నహి గరువు న్నహి
భావజ చంద్రులకు వికచ పద్మదళాక్షి!

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-3 ;July, Aug & Sept ),2026

అనే పద్యం ఉంది. ఇది నెల్లూరు ముత్తరాజు పద్మావతీ కళ్యాణంలోని పద్యంగా ఉంది. ఇందు "దేవుడు నహి, గురువున్నహి" అనే పలుకుబడి ఉంది. అది పద్మావతీ కల్యాణమే అర్వాచీన గ్రంథమనిపిస్తుంది. అందులోని పద్యాన్ని సంకలించిన ప్రబంధ రత్నాకరం అంతకంటే అర్వాచీన గ్రంథమవుతుంది. ప్రత్యంతరంలో ఈ క్రింది పద్యం ఉంది.

సీ. బొమ్మంచు లువ్వంగములు గజపొప్పళ్ళు
జలుగు జెంగావులు చిలుకచాళ్ళు
వలిపెంపులెడమ ధావళములు ముత్యాల
పందిళ్ళు వోజులు పచ్చబట్లు
గళ్ళకాపులు చిత్ర కోలాటములు గంధ
గావులు సతినీలు గర్ధసఖులు
మేఘవన్నెయలు లక్ష్మివిలాసములు కం
టక గుజ్జగలును నందనవనాలు
గీ. మండలాచరణంబులు నిండు జంత్రి
కలు చలారులు షీటులు కారికములు
తోరహస్తుల్ కలంబీలు దుప్పటములు
కటి తలంబుల నొప్పుగా గట్టుకొనిరి

ఈ పద్యం అంగద బసవయ ఇందుమతీ కల్యాణంలోని పద్యంగా వుంది. ఈ పద్యంలో 'షీట' అనే ఆంగ్ల పదం వాడటం జరిగింది. షీట్ అంటే నేపకిన్, క్లాత్, అర్జవల్, ఏబ్రాడ్ పీస్, ఆఫ్ లెనిన్, ఆర్ కాటన్ స్టఫ్ అని ఆంగ్ల నిఘంటు అర్థాలు. ఆంగ్ల పదాన్ని ప్రయోగించిన ఇందుమతీ పరిణయమే 16వ శతాబ్దపు గ్రంథం కాజాలదు. అందలి పద్యాన్ని సంకలించిన ప్రబంధరత్నాకరం 18వ శతాబ్ద గ్రంథమౌతుంది.

తంజావూరు సరస్వతీ మహలు గ్రంథాలయంలోని ప్రబంధ రత్నాకరం ఒక సంకలన గ్రంథం. కాకినాడ ఆంధ్రసాహిత్య పరిషత్ కార్యాలయంలోని "ఉదాహరణ పద్యాలు" మరొక సంకలన గ్రంథం. ఈ రెండు సంకలన గ్రంథాలలోని అముద్రిత గ్రంథ పద్యాలు "ప్రబంధ రత్నావళి" పేర ప్రకటింపబడింది.

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-3 ;July, Aug & Sept ),2026

ప్రబంధ రత్నావళిలో ప్రబంధ రత్నాకరం తృతీయాశ్వాసంలోని పెద్ద గ్రంథపాతంలోని పద్యాలు, చతుర్థాశ్వాసాలలోని పద్యాలు లేవు. అంతేకాదు ప్రబంధ రత్నాకరంలోని అనేక పద్యాలకు ఆకరాలు వున్నాయి. అనేక పద్యాలకు ఆకరాలు లేవు. ఆకరాలు లేని పద్యాలు తత్పూర్వాకరాలలోని పద్యాలుగా ప్రబంధ రత్నావళిలో ప్రదర్శింపబడ్డాయి.

ఆకరాలు లేని పద్యాలెల్లా తత్పూర్వాకరములలోని పద్యాలు కావు. కొన్ని అవుతాయి. కొన్ని కావు. కాని పద్యాలు ప్రశ్నార్థక చిహ్న యోగ్యాలు. ఆsTÖ కారణాలవల్ల ప్రబంధ రత్నాకరం పూర్తి స్వరూపం ప్రత్యక్షమవడానికి తంజావూరు ప్రతిని, ప్రత్సంతరాన్ని మేళవించిన ప్రబంధ రత్నాకరం ప్రత్యేక గ్రంథం పరిష్కృత గ్రంథం ఆంధ్రసాహిత్య జిజ్ఞాసువులకు అవశ్యకం.

తంజావూరి ప్రతికి నకలు కాగితపు ప్రతి ఆంధ్ర విశ్వకళాపరిషత్ గ్రంథాలయంలో ఉంది. 13-3-1892 నాటి ప్రత్యంతరం. కాగితపు ప్రతి ఆచార్య కొర్లపాటి శ్రీరామమÖర్తి గారు రెంటినీ మేళవించి ముద్రితాలైన ఆకర గ్రంథాలను ప్రబంధ రత్నావళిని సంప్రదించి పరిష్కరించినదే ప్రబంధ రత్నాకరం.

**సంకలనం - వికాసదశ**

మడికి సింగన కాలం నుండి ఇంచుమించు 1920, 25 ప్రాంతం వరకూ సంకలనశాఖ నిరూపమానమైన అభివృద్ధి సాధించింది. జగ్గన్నగారి తర్వాత ఈ క్రమంలోనే 18వ శతాబ్దంలో ప్రబంధ మణిభూషణమనే మరొక సంకలన గ్రంథం వెలసింది. దానికర్త ఎవరో తెలియదు. ఏకాశ్వాస ప్రబంధమిది. దీనిలో కథా రూపంగా 17వ శతాబ్దం వరకు ఉన్న కవులున్నారు. దీనిలో కథారూపంగా 17వ శతాబ్దం వరకు ఉన్న కవులున్నారు. దీనిలో కవుల పద్యాలు గ్రహించడంతో బాటు కథనాత్మకంగా సంకలనం చేయబడింది. దీనినొక సంకలన ప్రబంధంగా గుర్తించాలి. ప్రబంధ ప్రక్రియ ప్రభావం దానిమీద అపరిమితంగా ఉందనడానికి కూర్పు చేసిన విధానమే తార్కాణం. ఇందులో సుమారు 400 పద్యాలకు ఇప్పటికీ ఆకరాలు లభించలేదు.

తే. చంద్రకాంత శిలా మణిస్థల కృపీట
నిర్ఝరాంధో వ్యధా మోక్ష నియమవైద్యు
డంధకారచ్ఛటా హాలహల హరుండు
చంద్రుడొప్పారెఁ గాంతి d◌తెŸ◌ంద్రుడగుచు

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-3 ;July, Aug & Sept ),2026

ఈ పద్యం సంకలించడంతో శ్రీనాథుడు వల్లవాభ్యుదయం అనే రచన చేశాడని సాహిత్యలోకానికి స్పష్టమవుతుంది. ఇంకా శ్రీనాథుని భీమఖండం, శృంగారనైషధాల నుండి కూడా జగ్గన్న పద్యాలను సంకలనం చేశారు.

పెద్దపాటి జగ్గన్న కాలం 16వ శతాబ్దపు పూర్వార్ధం సకలనీతి సమ్మతం తర్వాత పుట్టిందీ గ్రంథం. దీనిలో నన్నయకు పూర్వకవి కృతుల నుంచి 16వ శతాబ్దం ప్రథమార్థం చివరి వరకు వున్న కృతుల నుండి పద్యాలు ఎన్నుకోబడ్డాయి. ప్రబంధాలు వర్ణన ప్రధానాలు కాబట్టి వర్ణనలకు సంబంధించినదిగా ఊహించవచ్చు.

ప్రబంధాల్లో క్రమానుగతంగా పాటిస్తున్న వర్ణనీయ వస్తు సముదాయ మంతా ఇంచుమించు అదే క్రమంలో అమర్చబడింది. ఈ గ్రంథ ప్రణాళిక పరిశీలిస్తే ఒక ప్రబంధం కూర్పు చేయాలన్న వివిధ కవుల కృతుల నుండి ఎన్నుకున్న అంశానికి అనుగుణంగా పద్యాల ఎన్నిక జరిగింది. ఇవి ఖండ ఖండాలుగా ఉండకుండా కొంత కథను కూడా జోడించి కృత్యవతారిక, షష్ఠ్యంతాలు, ఆశ్వాస విభాగం చేసి అఖండాకృతిగ మలిచే ప్రయత్నం జరిగింది. ఇవి కూర్పు చేసిన వారు స్వయంగా కవులు కావటం విశేషం. పై మార్గంలోనే 18వ శతాబ్దం నుండి మరికొన్ని సంకలనాలు పుట్టాయి.

**శ్రీకృష్ణలీలా విలాసం - (1800 ప్రాంతం) :**

దీనిని కూర్చినది పూసపాటి అచ్యుతరామరాజు. సంకలనం చేయబడిన పద్యాలన్నీ కూచిమంచి తిమ్మకవి కృతుల నుండి గ్రహింప బడ్డాయి. ఇది ఇంకా అముద్రితంగానే ఉంది. 1875 ప్రాంతంలో భారత సారముక్తావళి వెలువడింది. దీనిని తయారు చేసినది శ్రీ కట్టమంచి సుబ్రహ్మణ్యరెడ్డి, కవిత్రయ భారతంలోని రాజకీయ, సాంఘిక, ఆధ్యాత్మికాది వివిధ విషయాలను వర్గీకరించి దీనిని కూర్చారు. ఈయనే భారత సారముక్తావళి లాగే భాగవతసార ముక్తావళి అనే పేరుతో మరొక సంకలనం వెలువరించారు.

1900 ప్రాంతంలో భట్టిప్రోలు రామచంద్రయ్య "ఆంధ్రకవి రత్నాకరం" పేరుతో వివిధ ప్రాచీన గ్రంథాల నుండి సూక్తులు, లోకోక్తులు ఏరికూర్చి ఆకరాలతో సహా ఒక సంకలనాన్ని ప్రకటించారు.

1903 సం.లో వేంకటగిరి పాలకులైన శ్రీకృష్ణయాచేంద్ర ప్రేరణతో మోదీ జగన్నాథం, వివిధ ప్రబంధాలకు చెందిన శృంగారరస సంబంధ పద్యాలను గ్రహించి శృంగార పద్యావళిని ప్రకటించారు.

Publications

United International Journal of Multidisciplinary Research (UIJMR)

An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal

ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-3 ;July, Aug & Sept ),2026

1915 సం.లో శ్రీ సమర్థి రంగయ్య శ్రేష్ఠి వివిధ ప్రబంధాలలోని వివిధ ఋతువర్ణనలను గ్రహించి ఋతుచక్రము పేరుతో ఒక గ్రంథాన్ని వెలువరించారు.

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారిచే 1917 సం॥లో 'చాటుపద్య మణిమంజరి' అనే సంకలిత గ్రంథం వెలువడింది. దీనిలో అనేక విషయాలకు చెందిన చాటువులున్నాయి. సాధ్యమైనంతవరకు ఈ చాటువులను సేకరించి కథా సందర్భమును కూడా చేర్చి సంకలన రూపంలో వెలువరించినట్టిదే చాటు పద్యమణి మంజరి. ఇదే సం.లో శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రి, ప్రభాకర శాస్త్రి గారి మార్గంలోనే "చాటుపద్య రత్నాకరం" అనే మరో సంకలనాన్ని సమకూర్చారు.

ఈ విధంగా సంకలన గ్రంథాల పుట్టుకలో గొప్ప పరిణామం కనిపిస్తుంది. గుర్తింపు బాగా వచ్చింది. వివిధ అంశాలను సంకలనానికి గ్రహించవచ్చనే భావం బాగా నాటుకుంది. ఒకే అంశాన్ని వివిధ కృతుల నుండి సేకరించి అందించే పరిశోధన తత్త్వం కావ్యమార్గంలో అభివృద్ధి చెందింది. పెక్కుమంది కవుల కృతుల నుండి ఎన్నుకున్న అంశాన్ని గ్రహించడమే కాక ఒక కవి రచించిన కృతుల నుండి వస్తుస్వీకరణ జరిగింది.

బహు కర్తృకాలైన ఆంధ్ర మహాభారతం, ఆంధ్ర మహాభాగవతం నుండి వివిధాంశాలను వింగడించి, వాటికి శీర్షికలు నిర్ణయించి కూర్పు చేశారు. కూర్పు చేసినవారు కవులు కావటం వలన వారుకూడా సొంతంగా కొన్ని పద్యాలు రచించి సంకలనాల్లోకి చొప్పించారు. ఒక అంశం ప్రధానంగా ఎన్నుకొని సమగ్రంగా సేకరించగలిగినప్పటికీ, సేకరించిన అంశానికి అనున్యూనతను కలిగించడానికి ప్రయత్నించారు.

మడికి సింగన కాలం నుండి ఇంచుమించు 1920-25 ప్రాంతం వరకు సంకలనశాఖ నిరుపమానమైన అభివృద్ధి సాధించింది. కృతుల సంఖ్య తక్కువగా వున్నా అభివృద్ధి సూచిక పరిణామంలోనే ఉందిగానీ పాడిందే పాటగా ఏ కృతీ వెలువడలేదు. ఇంతవరకూ నీతి, భక్తి, సూక్తి, లోకోక్తి, శృంగారం, ఋతువర్ణన, చాటువులు అనే అంశాలపై ఈ సంకలనాలు వెలిసాయి. ఇప్పటివరకూ ఉన్న సంకలనాలన్నింటినీ ప్రాచీన దశగానే గుర్తించవచ్చు.

సంకలన తత్త్వంలో కూర్పు ప్రధానమైనది. ఈ కూర్పు విషయంలో అంతవరకూ పుట్టి కావ్యాలనే ఆదర్శంగా తీసుకున్నారు గానీ వర్తమాన కాలానుగుణంగా కొంతమంది కవులు కలిసి ఒక సంకలనాన్ని వెలువరించాలనే ఉద్దేశం కనిపించదు. ఈ దృక్పథం ఆధునిక సాహిత్య వాతావరణంలో

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-3 ;July, Aug & Sept ),2026

ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. అంశాన్ని ఎన్నుకొనే విషయంలో కూడా పూర్వ సంకలనాల్లో నవ్యత అంతగా గోచరించదు. ఒక్కనీతి, సూక్తి విషయాలలో తప్ప ఔపదేశిక ప్రయోజనం కూడా కనిపించదు.

ఏ వ్మైజయ శాఖకైనా ఆవిర్భావ అభివృద్ధి వికాసదశలు తప్పక ఉంటాయి. అభివృద్ధి వికాసదశలో ఏదో ఒక దశలో లోపించవచ్చు. లేదా రెండూ ఉండకపోవచ్చు. ఇక్కడ అభివృద్ధి అంటే వస్తు విన్యాసంలో గాని, స్వరూప స్వభావాలలోగాని ప్రస్ఫుటమైన మార్పు గోచరించదు. కానీ ఆ శాఖ అస్తిత్వాన్ని కోల్పోకుండా సజీవంగా నిలిచే ఉంటుంది. సంకలనశాఖ కూడా 1920 వరకు ఇదే విధమైన అభివృద్ధి దశలో ఉంది. ఒకరు కథను జోడిస్తే మరొకరు ఆకరాలు కూడా ఇచ్చారు. కొంతమంది ఏకకవి కృతాలైన వివిధ కృతుల నుండి ఎన్నుకున్న అంశాన్ని సంకలనానికి ఉపయోగించారు. బహుకర్తృకాలైన ఒకే గ్రంథం నుండి కొంతమంది సంకలనాలకు సంతరింప జేసారు. ఈ కృషి అంతా అభివృద్ధి దశలోనే వస్తుంది. కానీ వికాసదశగా గుర్తించలేం. కాబట్టి ఇవన్నీ ప్రాచీన పంథాలో నడిచిన ప్రాచీన దశలోని సంకలనాలుగానే గుర్తించబడుతున్నాయి.

**ఉపయుక్త గ్రంథసూచి:**

1. అలబ్ధ కావ్యపద్యముక్తావళి; సం : డా. ఆర్. శ్రీహరి
2. ఆంధ్ర కవుల చరిత్రము; కందుకూరి వీరేశలింగం పంతులు
3. తెలుగలో సంకలనాలు; డా. గొల్లకోట సూర్యభాస్కరరావు
4. తెలుగు సాహిత్య కోశము (ప్రాచీన సాహిత్యము) 1980; తెలుగు అకాడమీ, హైదరాబాదు.